ఈఎస్‌ఐలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలివ్వాలి

మల్లాపూర్: నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో పనిచేసే హౌస్ కీపింగ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్‌తో ఆస్పత్రి ఆర్ఎంవో శ్వేత, సూపరింటెండెంట్ కమల కుమ్మక్కయ్యారని బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య ఆరోపించారు. నాచారం ఈఎస్‌ఐలో ప్రస్తుతం చేస్తున్న 200 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించి కొత్తవారిని పెట్టుకొని డబ్బులు వసూలు చేసేందుకు భారీగా స్కెచ్ వేశారన్నారు. గతంలోనే సూపరింటెండెంట్‌పై ఆరోపణలతో కేసు కూడా నమోదైందన్నారు. జీతాలు ఇవ్వకుండా ఆపై వేధిస్తున్న వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వేముల మారయ్య డిమాండ్ చేశారు. నాచారం ఈఎస్‌ఐలో జరుగుతున్న గోల్‌మాల్‌పై అన్ని వివరాలను వెల్లడిస్తానని తెలిపారు.

కరాటేలో ప్రతిభ చాటిన విద్యార్థులు



కరాటేలో మెడల్స్ సాధించిన విద్యార్థులు

బోడుప్పల్: కరీంనగర్‌లో జరిగిన ఇండో నేపాల్ కరాటే టోర్నమెంట్‌లో బోడుప్పల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ టోర్నమెంట్‌లో 200 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో యశస్విని, సాయి ప్రియ, హర్షిని, సహస్రాచ్, శ్రేయాన్స్ గోల్డ్ మెడల్స్ సాధించినట్లు ఆర్ఎస్ఎస్ కాయ్ ఇండియా చీఫ్ మాస్టర్ నగేష్, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ వెల్లడించారు. బుధవారం వారు బోడుప్పల్‌లో మాట్లాడుతూ అజిత్ నందన్, ఉజ్వల్, శ్రీయ, నందు సిల్వర్ మెడల్స్, భువన్‌కుమార్, సూర్య తేజ్, సాత్విక్, కోమల్, జోహిత బ్రౌన్ మెడల్స్ సాధించినట్లు వెల్లడించారు. వారిని మెడల్స్‌తో సత్కరించారు. కరాటే మరింత ప్రతిభ చాటేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.

అక్రమంగా నిర్మిస్తున్న షెడ్ కూల్చివేత


షెడ్‌ను జేసీబీతో కూల్చివేస్తూ..

మల్లాపూర్: నాచారం సీకే గార్డెన్ వద్ద నిర్మిస్తున్న భారీ షెడ్‌ను టౌన్ ప్లానింగ్ ఏసీపీ గిరిరాజ్ పర్యవేక్షణలో బుధవారం జేసీబీతో కూల్చివేశారు. నాచారం పోలీసుల బందోబస్తు మధ్య కూల్చివేశారు. ఈ సందర్భంగా ఏసీపీ గిరిరాజ్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా షెడ్లు నిర్మిస్తే కూల్చివేస్తామన్నారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, నాచారం పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి


మంగపురం కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ మంగపురం కాలనీలో బుధవారం సీసీ రోడ్డు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. అభివృద్ధి పనుల పేరుతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పనులు అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారితో పాటు అశోక్‌రెడ్డి, కనకయ్య, సురేష్‌బాబు, సాయికుమార్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్ కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి బుధవారం 21వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ భూక్యా సుమన్ నాయక్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తానని కమిషనర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పెండింగ్ ఉన్న పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యదర్శి ఎలుగొండయ్య, ఉపాధ్యక్షులు నరేందర్‌రెడ్డి, నాయకులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

చెత్త తొలగించడంలో నిర్లక్ష్యం


నాచారం రాంరెడ్డినగర్ కమాన్ వద్ద పేరుకుపోయిన చెత్త

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని రాంరెడ్డినగర్ కాలనీకమాన్ వద్ద చెత్తతో కాలనీవాసులు, అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాసన భరించలేకపోతున్నామని వాపోతున్నారు. చెత్తను సేకరించేవారు సక్రమంగా రాకపోవడంతో రోడ్లపై చెత్త వేస్తున్నారని స్థానికులు అంటున్నారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రోడ్డుపై చెత్త కుప్పలుగా పేరుకుపోతోందని, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని అంటున్నారు.

బ్లాస్టింగ్‌లతో ఇబ్బందులు

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో రియల్ వ్యాపారులు వెంచర్ ఏర్పాటుకు గుట్టలను ఇష్టానుసారంగా బ్లాస్టింగ్‌లు చేయడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. హరీష్ గాంధీ అనే వ్యక్తి పొలం గ్రామానికి దగ్గరగా ఉండటంతో అక్కడ అడ్డగోలుగా బ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. మైనింగ్ శాఖ నుంచి, ఇతర శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లకు పాల్పడుతుండటంతో శబ్దాలకు గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. సమీపంలోని ఇళ్లు పగుళ్లు వస్తుండటంతో ఆస్తి నష్టం వాటిల్లుతోంది. అక్రమంగా పేలుళ్లు చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రౌండ్‌వాటర్.. డౌన్..

ఈ ఏడాది పడిపోయిన భూగర్భ జలాలు

- నగటున 1.78 మీటర్ల లోతుకు నీటిమట్టం
- అధికంగా ఎంసీపల్లిలో 11.80 మీటర్ల లోతుకు..
- నీటి పొదుపునకు ప్రజల్లో అవగాహనకు సిద్ధం
- గతేడాదితో పోలిస్తే 13 మండలాల్లో తగ్గుముఖం
- కేవలం మూడు మండలాల్లో నిలకడగా..

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో భూగర్భ జలమట్టం గతేడాది జనవరి నెలతో పోల్చుకుంటే, ఈ ఏడాది జనవరిలో సగటున 1.78 మీటర్ల లోతుకు పడిపోయింది. జిల్లాలో 13 మండలాల్లో నీటి మట్టం తగ్గుముఖం పట్టింది. పెరుగుతున్న ఎండల నేపథ్యంలో జిల్లా భూగర్భ జలశాఖ నీటి వృథాను అరికట్టేందుకు.. అవసరాలకు తగినట్లుగా వినియోగించుకోవాలని నీటి పొదుపుపై అవగాహనకు చర్యలకు సిద్ధమవుతోంది. రానున్న మూడు నెలల్లో ఎండలు తీవ్రతరం కానుండటంతో నీటి పొదుపు చాలా అవసరమని పేర్కొంటోంది. ఇంటి ఆవరణలో పడిన వర్షపు నీరు వృథాగా పోకుండా.. ఇంట్లోనే ఇంకించుకునే విధంగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని జిల్లా భూగర్భ జలశాఖ అధికారి రేవతి పేర్కొంటున్నారు. రైతన్నలు కూడా తమ పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నారు. అధిక వ్యయం ఉన్న పంటలు కాకుండా పంటల మార్పిడికి రైతులు సిద్ధం కావాలని భూగర్భ జలశాఖ పేర్కొంటోంది. ఎండిపోయిన బోరు బావులను రీచార్జి బావులుగా మార్చుకోవాల్సిన ఆవశ్యకతపై దృష్టి సారించాల్సి అవసరం ఉందంటోంది.

13 మండలాల్లో జలం తగ్గినా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గతేడాది జనవరి మాసంతో భూగర్భ జలమట్టాన్ని సరిపోల్చుకుంటే జిల్లాలో సగటున 1.78 మీటర్ల లోతుకు జలమట్టం పడిపోయింది. జిల్లాలో మండలాల వారీగా భూగర్భ జల మట్టాన్ని పరిశీలిస్తే 13 మండలాల్లో లోతుకు పడిపోగా, మిగతా 2 మండలాల్లో నిలకడగా నీటి మట్టం ఉన్నట్లు భూగర్భ జల శాఖ రికార్డులు పేర్కొంటున్నాయి. మూడుచింతలపల్లి మండలంలో అత్యధికంగా 11.80మీటర్ల లోతుకు భూగర్భ జలమట్టం పడిపోయింది. అలాగే, అల్వాల్ మండలంలో 2.59 మీటర్లు, కుత్బుల్లాపూర్ మండలంలో 2.28 మీటర్లు, మేడ్చల్ మండలంలో 2.10 మీటర్లు, బాలానగర్ మండలంలో 1.62 మీటర్లు, మల్కాజిగిరి మండలంలో 1.89 మీటర్లు, బాచుపల్లిలో 0.57 మీటర్లు, శామీర్‌పేటలో 0.46 మీటర్లు, ఘట్‌కేసర్‌లో 0.84 మీటర్లు, కీసరలో 0.68 మీటర్లు, కాప్రాలో 0.06 మీటర్లు, కూకట్‌పల్లిలో 0.67 మీటర్లు, మేడిపల్లి మండలంలో 0.56 మీటర్ల లోతుకు భూగర్భ జలమట్టం(జలాలు) పడిపోయాయి.

నీటిని వృథా చేయకుండా..

ఈ 13 మండలాల ప్రజలు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని జిల్లా భూగర్భ జలశాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. మండుతున్న ఎండల నేపథ్యంలో రానున్న(మార్చి, ఏప్రిల్, మే, జూన్) మాసాల్లో నీటి పొదుపుపై ప్రజలు, ముఖ్యంగా మహిళలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. జిల్లాలోని మరో 2 మండలాల్లో మాత్రం భూగర్భ జలమట్టం నిలకడగా ఉంది. ఉప్పల్ మండలంలో గతేడాది(2023) జనవరిలో నెలతో సరిపోల్చుకుంటే.. ఈ ఏడాది(2024) జనవరిలో 5.42 మీటర్ల భూగర్భ జలమట్టం పెరిగింది. దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 0.02 మీటర్ల భూగర్భ జలమట్టం పెరిగింది. అయినప్పటికీ.., మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని నీటి పొదుపును పాటించాలని భూగర్భ జల శాఖ జిల్లా ప్రజలను కోరుతోంది.


భూగర్భ జల మట్టాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు

ఉద్యమకారుడికి నివాళి


నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

మల్కాజిగిరి: తెలంగాణ ఉద్యమకారుడు, అనారోగ్యంతో మృతి చెందిన వీరేశంగౌడ్‌కు మల్కాజిగిరి చౌరస్తాలో నివాళులర్పించారు. మలి విడత ఉద్యమ సమయంలో మల్కాజిగిరి జేఏసీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాడని, అప్పటి జేఏసీ చైర్మన్ వెంకన్న తెలిపారు. ఉపేందర్, శ్రీనివాసరెడ్డి, ఎల్లేష్, సతీష్, జగ్‌మోహన్, నర్సింగరావు, రమేష్‌గౌడ్ ఉన్నారు.

ఎస్టీపీ ప్లాంట్‌ను త్వరలో వినియోగంలోకి తీసుకురావాలి

మల్లాపూర్: నాచారం హెచ్ఎంటీనగర్ పెద్ద చెరువుపై నిర్మించిన మురుగుశుద్ధి ఎస్టీపీ ప్లాంట్‌ను బుధవారం స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.32 కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం 17.5 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఎస్టీపీ ప్లాంట్‌ను నిర్మించిందన్నారు. ఇప్పటికైనా త్వరలోనే ప్రారంభించి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం సుబ్రహ్మణ్యం, డీజీఎం నాగేశ్వర్‌రావు, హెచ్ఎంటీనగర్, సరస్వతినగర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారులకు ఆర్థిక చేయూత


విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ పథకంపై అవగాహనలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

కుషాయిగూడ: చేతివృత్తిదారులకు ఆర్థిక చేయూత అందించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. అభయ అసోసియేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చేతివృత్తులు చేసుకునే వారికి ఆర్థిక చేయూత అందించి ప్రోత్సహించాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యం అన్నారు. ఆ దిశగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకం ద్వారా లబ్ధి పొంది తమ వ్యాపారాలు, పనులను వృద్ధి చేసుకోవాలన్నారు. మహిళలను చైతన్య పరుస్తూ ఉపాధి మార్గాలు చూపుతున్న అభయ సంస్థ ప్రతినిధుల సేవలను ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా 60 మంది మహిళలను పథకంలో ఎన్‌రోల్ చేయించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు అనుముల నర్సింహరెడ్డి, బ్రహ్మచారి, నర్సింగ్‌రావు, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యను పరిష్కరించండి


అధికారులు, కాలనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: బండచెరువు కింది ప్రాంతంలోని కాలనీల్లో ముంపు సమస్యను పరిష్కరించాలని కాలనీ ప్రతినిధులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కాలనీ ప్రతినిధులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో నాలా విస్తరణ జరగకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాక్స్‌డ్రైన్ నిర్మాణానికి కూడా కొన్ని కాలనీ ప్రతినిధులు అభ్యంతరం చెబుతున్నారని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.

కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం


మారుతీనగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభిస్తున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 24వ డివిజన్ పరిధి మారుతీనగర్ కాలనీలో సుమారు రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ పనులను బుధవారం నగర మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, 24వ డివిజన్ కార్పొరేటర్ ఏంపల్లి అనంతరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మారుతీనగర్ కాలనీ ప్రెసిడెంట్ సిద్దుల శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ బొక్క చంద్రశేఖర్, ఏనుగు మనోరంజన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అంతా కలిసి అభివృద్ధి చేసుకుందాం..

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: అంతా కలిసి ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, కార్పొరేటర్లు కక్కిరేణి చేతన, బండారి శ్రీవాణి, బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. ఉప్పల్ నియోజకవర్గంలో చాలా సమస్యలు ఉన్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. కుక్కల బెడద, తాగు నీటి సమస్య, రోడ్లు, మురుగు తదితర అనేక సమస్యలు ఉన్నాయని, అధికారులు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. కుక్కలు చిన్న పిల్లలను టార్గెట్ చేస్తున్నాయని, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఓయూ క్యాంపుల్లో విధిగా తాగునీరు అందించాలని సూచించారు. నిధుల కొరత లేకుండా తాను చూసుకుంటానని, కలిసి పని చేయడంలో ఎలాంటి ఇబ్బంది ఉన్నా ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్, ఈఈ నాగేందర్, తహసీల్దార్ వెంకట నర్సింహరెడ్డి, ట్రాఫిక్ సీఐ అశోక్ యాదవ్, విద్యుత్ అధికారి బాలకృష్ణ ఉన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా


హెచ్ఆర్.మోహన్, శ్రీకాంత్‌గౌడ్‌ను సత్కరిస్తున్న అంబేడ్కర్‌నగర్ కాలనీవాసులు

మల్లాపూర్: ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ హెచ్ఆర్.మోహన్ అన్నారు. నాచారం అంబేడ్కర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎస్సీసెల్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం హెచ్ఆర్.మోహన్, కాంగ్రెస్ పార్టీ నాచారం డివిజన్ అధ్యక్షులు బందారం శ్రీకాంత్‌గౌడ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నూతలకంటి రాజు, ప్రధాన కార్యదర్శి మహేష్, బండారు రఘు, క్రాంతి, ట్రోని, నరేష్, అబ్రహ్మం, రాకేష్, వెంకటేష్, శ్రీహరి, ప్రవీణ్, బాలరాజ్, సందీప్, జయమ్మ, సుజాత, సరస్వతి తదితరులు ఉన్నారు.

అసంపూర్తి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జితో అవస్థలు


వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ పట్టణ పరిధిలో గిర్మాపూర్ రోడ్డులో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి అసంపూర్తిగా ఉండటంతో పట్టణంలోని వివిధ కాలనీలు, మండలంలోని పలు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారని బీజేపీ నాయకులు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు వినతి పత్రాలు అందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రం రెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాఘవరెడ్డి, నాయకుడు రాగం ఆనంద్ తదితరులు ఉన్నారు.

అనాథ పిల్లలకు ఉచితంగా భోజనం

కీసర: కీసరగుట్ట ఆర్యవైశ్య అన్నదాన సత్రం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కీసరగుట్ట ఆర్యవైశ్య అన్నదాన సత్రం అధ్యక్షుడు బెలిదే రమేష్‌గుప్తా అన్నారు. బుధవారం కీసరగుట్టకు వచ్చిన సికింద్రాబాద్ వైష్ణవినగర్‌కు అనాథాశ్రమానికి చెందిన సుమారు 50 మంది వికలాంగులు, అనాథ పిల్లలకు ఆర్యవైశ్య సత్రం ఆధ్వర్యంలో ఉచితంగా భోజన ఏర్పాట్లు కల్పించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



గౌతంనగర్: ఐఎస్‌నగర్‌కు చెందిన శ్యామ్‌కుమార్ కుమార్తె సంజన(13) అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాముయాదవ్ ఆమె అంత్యక్రియలకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో చైన్ స్నాచింగ్

అల్వాల్: మధ్యాహ్నం ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడు లాక్కొని పారిపోయిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. వెంకటాపురంలో నివసించే ఓ గృహిణి ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తి హెల్మెట్ పెట్టుకొని వచ్చాడు. మహిళ మెడలో నుంచి మూడున్నర తులాల పుస్తెల తాడు లాక్కొని పారిపోయాడు. బాధితురాలు మూడు నెలల గర్భిణి అని తెలిసింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమైన పోలీసులు 3 గంటల్లో నిందితుడిని పట్టుకున్నట్లు తెలిసింది. ఇతర కేసుల్లో ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలో విచారిస్తున్నట్లు తెలిసింది.

అందరికీ ఉపయోగపడే సామాజిక భవనం

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ సొసైటీలో ఉన్న కమ్యూనిటీ హాల్ అందరికీ ఉపయోగపడే సామాజిక భవనం అని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం కాలనీ మహిళలు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నపూర్ణ సొసైటీలో ఉన్న కమ్యూనిటీ హాల్ భవనం సొసైటీది కాదని, ప్రజలు దాన్ని ఉపయోగించుకోవాలన్నారు.


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసిన కాలనీవాసులు

పేదలకు న్యాయం చేయండి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి


ఏడీఆర్ఎమ్‌కు వినతిప్రతం అందజేస్తున్న ఎమ్మెల్యే

మల్కాజిగిరి: వినాయకనగర్ ప్రాంతానికి చెందిన పేదలకు న్యాయం చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే ఏడీఆర్ఎమ్ గోపాల్‌ను కోరారు. ఎంఎంటీఎస్ రెండవ దశలో భాగంగా రైల్వే ట్రాక్‌కు సమీపంలో ఉన్న వినాయకనగర్, దినకర్‌నగర్, తారకరామానగర్ ప్రాంతానికి చెందిన ప్రజలు ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయడంతో ఎమ్మెల్యే వ్యతిరేకించారు. ఏడీఆర్ఎంను కలిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో పేదలకు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పట్టాలిచ్చారన్నారు. సుమారు 30 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయిస్తాం అనడం తగదని, వారికి శాశ్వత పరిష్కారం చూపాలని ఏడీఆర్ఎమ్‌ను కోరానన్నారు. ఈ నెల 14వ తేదీన మరోమారు సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించాలి

జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్: ఒత్తిడులకు తలొగ్గకుండా ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ముందుండాలని జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 14 శాతం ట్యాక్స్‌తో అనుమతిచ్చే ఇళ్ల విషయంలో ఒకటికి రెండుసార్లు పరిశీలించాలన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు పార్టీలకతీతంగా పనిచేయాలన్నారు. ఉత్తర్వులు 58, 59 దరఖాస్తుదారుల వివరాలు స్థానిక పంచాయతీ కార్యాలయంలో అందజేయాలన్నారు. బుధవారం నుంచి ప్రారంభమైన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ట్యాంకులను శుభ్రం చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి వైస్ ఎంపీపీ జంగమ్మ, ఎంపీడీఓ అరుణ, ఎంపీఓ నందకిశోర్, ఎంపీటీసీలు సరళ, శోభారాణి, వినోద, భాస్కర్‌రెడ్డి, రామారావుముదిరాజ్, రవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

రోడ్ల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని వినతి


రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి అందజేస్తున్న వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: మేడ్చల్ నియోజకవర్గంలో రోడ్లను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. నూతన రోడ్లు, అలాగే మరమ్మతులు చేయడానికి నిధుల కోసం అవసరమైన ప్రతిపాదనలు అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.